
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
శనివారం 28 జూన్ 2025



'బోగస్'పై ఫోకస్..

- ఆరునెలలుగా రేషన్‌కు రాని కార్డుదారుల గుర్తింపు
- క్షేత్రస్థాయిలో పరిశీలన తర్వాత చర్యలు
- గత నెలలో 1,102 కార్డులపై విచారణ
- 797 మంది సభ్యుల తొలగింపు
- చివరి దశకు మూడు నెలల సన్న బియ్యం పంపిణీ
- జిల్లాలో 98.59 లక్షల సబ్సిడీ బియ్యం కోటా
- జిల్లాలో రేషన్ లబ్ధిదారులు 5.35 లక్షల మంది





(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

బోగస్ రేషన్ లబ్ధిదారులపై సర్కార్ దృష్టి పెట్టింది. పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నేపథ్యంలోనే అనర్హులను ఏరివేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

వర్షాకాలంలో రవాణా సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున పేదలకు మూడునెలలు బియ్యంకోటాను ఒకేసారి ఇస్తున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలో ఇప్పటికే 85శాతం పైగా సన్నబియ్యం పంపిణీ పూర్తి చేశారు. ఇదే సమయంలో బోగస్ కార్డులను తొలగించే ప్రక్రియకు పూనుకుంటోంది. అందులో భాగంగా క్షేత్రస్థాయిలో రేషన్ దారుల జాబితాను తనిఖీ చేయాలని అధికా రులకు ఆదేశాలు వచ్చినట్లు తెలిసింది.

రేషన్‌కు రాకుంటే 'కార్డు' కట్

బడుగు, బలహీన వర్గాలకు ప్రయోజన కరంగా ఉండాలని ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు ఆరుకిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. జూన్ మాసంలో వర్షాకాల సీజన్ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మూడునెలల రేషన్‌బియ్యం ఒకేసారి ఇస్తు న్నారు. ఇదేక్రమంలో ప్రజాపంపిణీ ప్రయోజ నాలు దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆరు నెలల పాటు రేషన్‌బియ్యం తీసుకొవడానికి రాని లబ్ధిదారులను గుర్తించారు. ఈజాబితా ప్రకా రం క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకో నున్నది. స్థానికంగా లేనివారు, పెళ్లిచేసుకొని అత్తారింటికి వెళ్లినవారు, మృతుల పేర్లను కార్డులో నుంచి తొలగించే ప్రక్రియ చేపట్టనున్నారు.

జిల్లాలో ఇప్పటికే 797 మంది తొలగింపు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఇటీవల రేషన్ డీలర్ల ద్వారా సేకరించిన వివరాలు ఆధారంగా 1,102 రేషన్ కార్డులపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపారు. ఇందులో 1,707మంది సభ్యులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపి 797 మందిని అనర్హులుగా గుర్తించి తొలగించారు. జిల్లాలో తొలగించిన వారిలో బోయిన్‌పల్లిలో 68మంది, చందుర్తిలో 39మంది, ఇల్లంతకుంటలో 114మంది, గంభీరావుపేటలో86 మంది, కోనరావుపేటలో 90మంది, ముస్తాబాద్‌లో 75మంది, రుద్రంగిలో 24మంది, సిరిసిల్లలో 147 మంది, తంగళ్లపల్లిలో 15మంది, వీర్నపల్లిలో 18మంది, వేములవాడ రూరల్‌లో 29మంది, వేములవాడలో 39మంది, ఎల్లారెడ్డిపేటలో 53మందిని అనర్హులుగా గుర్తించి జాబితా నుంచి తొలగించాలి.

● జిల్లాలో 1,77,851 రేషన్ కార్డులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 345 రేషన్ దుకాణాలు ఉండగా, 1,77,851రేషన్ కార్డులు, 5,35,920మంది లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో..

మిగతా 8లో

మూడు నెలల రేషన్ కోటా పంపిణీ ఇలా...

మండలం	లబ్ధిదారులు	బియ్యం(కిలోల్లో)
బోయినపల్లి	35,224	6,35,698
చందుర్తి	32,671	5,75,444
గంభీరావుపేట	44,049	7,96,665
ఇల్లంతకుంట	45,684	8,10,801
కోనరావుపేట	43,077	7,61,987
ముస్తాబాద్	45,382	8,21,029
రుద్రంగి	16,155	2,89,183
సిరిసిల్ల	85,726	17,60,795
తంగళ్లపల్లి	42,401	8,11,116
వీర్నపల్లి	14,055	2,55,335
వేములవాడ	60,249	10,64,136
వేములవాడ రూరల్	22,483	3,97,365
ఎల్లారెడ్డిపేట	48,764	8,80,232
మొత్తం	5,35,920	98,59,786

పద్మ అవార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

- జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అజ్మీరా రాందాస్

సిరిసిల్ల టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గణతంత్ర దినోత్సవం పురస్కరించుకొని-2026 పద్మ అవార్డుల కోసం జిల్లాలోని వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని శుక్రవారం జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్ తెలిపారు. కళలు, విద్యా, సాహిత్యం, మెడిసన్, క్రీడలు, సామాజిక సేవా, సైన్స్, సాంకేతిక రంగాలు, ప్రజా వ్యవహారాలు, పౌర సేవలు, వ్యాపారం, పరిశ్రమలు విభాగాల్లో అత్యున్నత సేవలు అందించిన వారు 2026-పద్మ అవార్డులకు దరఖాస్తులు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు వారికి సంబంధించిన నామినేషన్ పత్రాలు, సిఫారసులను జూలై 31 వరకు ఆన్‌లైన్ రాష్ట్రీయ్ పురస్కార్ పోర్టల్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. నామినేషన్స్‌కు సంబంధించిన అన్ని వివరాలను పోర్టల్‌లో పొందపరచబడి ఉన్నాయని, వివరాలకు జిల్లా యువజన క్రీడా శాఖ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



బీజేపీ సిరిసిల్ల పట్టణ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న గోపి

సిరిసిల్ల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టి 11 ఏళ్లు గడుస్తున్న సందర్భంగా చేసిన అభివృద్ధితో పాటు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి కోరారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్‌తో కలిసి ఇతర కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శులుగా కొండ నరేష్, మేర్గు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా మోర శ్రీహరి, అంకారపు రాజు, కాంబోజు శ్రీధర్, పల్లికొండ నర్సయ్య, కార్యదర్శులుగా కోడం రవి, సూరం వినయ్, పంపరి అర్జున్, కోడం శ్రీనివాస్, కోశాధికారిగా ఇంజపూరి మురళిలతోపాటు 33 మంది కార్యవర్గ సభ్యులను నియమించినట్లు ప్రకటించారు. అనంతరం జరిగిన సమావేశంలో గోపి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెన్నాడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్సీ కవిత



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ కవిత

బోయినపల్లి జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతిచెందిన సీనియర్ డాక్టర్ చెన్నాడి కుటుంబ సభ్యులను ఎమ్మెల్సీ కవిత శుక్రవారం పరామర్శించారు. కరీంనగర్ పట్టణంలోని సీనియర్ సర్జన్ డాక్టర్ చెన్నాడి రవీందర్‌రావు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందారు. ఈ సందర్భంగా కల్వకుంట్ల కవిత కుటుంబ సభ్యులను పరామర్శించి రవీందర్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ బోయినిపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ చెన్నాడి సుధాకర్‌రావు తదితరులు ఉన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే జైలుశిక్ష, జరిమానా

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రజిత



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డాక్టర్ రజిత

సిరిసిల్ల టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చట్టపరంగా జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రజిత అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా అధికారి డాక్టర్ రజిత అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ అడ్వైయిజరీ కమిటీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ రజిత మాట్లాడారు. గర్భస్థ పూర్వ పిండ నిర్ధారణలు, భ్రూణ హత్యలు నివారించాలని, గర్భస్థ శిశువులను కాపాడల్సిన బాధ్యత అందిరిపై ఉందన్నారు. లింగనిర్ధారణ పరీక్షలను నిషేధించారని, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ రూల్స్‌కు విరుద్ధంగా నడిపే స్కానింగ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు చట్ట ప్రకారం వారిపై రూ.50వేలు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు ప్రతి గర్భిణీ స్కానింగ్ వివరాలను ఫామ్ ఎఫ్‌లో పొందుపరుస్తూ వారి వివరాలను రెండు సంవత్సరాల వరకు స్కానింగ్ హార్డ్ డిస్క్‌లో నిల్వ ఉంచాలన్నారు. స్కానింగ్ సెంటర్ నిర్వాహకులకు సరైన స్కానింగ్ రిపోర్ట్స్ గర్భిణులకు సరైన రక్తపరీక్షల రిపోర్ట్స్ ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అంజలి ఆల్ఫ్రెడ్, డీపీఆర్‌వో శ్రీధర్, వైద్యులు అనిత, రామకృష్ణ, సంతప్, ఎన్జీవో అధ్యక్షుడు చింతోజు భాస్కర్, లీగర్ అడ్వయిజర్ శాంతిప్రకాష్‌శుక్ల, ఝాన్సీలక్ష్మి, రామానుజమ్మ, డిప్యూటీ డెమో రాజకుమార్, హెచ్‌ఈ బాలయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో కర పత్రాల కలకలం..

- పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : 'రేవంత్.. నువ్వు రైతులకు రైతు భరోసా ఒక్కో ఎకరానికి బాకీ పడ్డది' అంటూ లెక్కలతో కూడిన కరపత్రాలు శుక్రవారం దర్శనమివ్వడం ఎల్లారెడ్డిపేటలో కలకలం రేపింది. తెల్ల కాగితంపై ఎవరి పేరు లేకుండా ఎకరానికి రూ.17,500 నుంచి 7ఎకరాలకు రూ.1,22,500 బాకీ అనే లెక్కలతో కూడిన పత్రాలు పలు దుకాణాలు, వీధుల్లో కనిపించడం చర్చనీయాంశమైంది. సమాచారం అందుకున్న పోలీసులు పత్రాలను స్వాధీనపర్చుకున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల పనేనని కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. కర పత్రాలను పంచిన వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి కృషి

- అడిషనల్ డీజీపీ చారు సిన్హా



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, అధికారులు

సిరిసిల్ల క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్-11ను విజయవంతం చేయాలని ఉమెన్ సేఫ్టీ వింగ్ అడిషనల్ డీజీపీ చారు సిన్హా అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాజన్న సిరిసిల్ల జిల్లా అడిషనల్ ఎస్పీ చంద్రయ్యతో పాటు వివిధ జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జూలై 1నుంచి 31వరకు ఆపరేషన్ ముస్కాన్‌ను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. ప్రతి అధికారి పక్కా ప్రణాళిక రూపొందించుకొని బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా కృషి చేయాలన్నారు. బాలకార్మికులు కనిపిస్తే 1098కు వెంటనే సమాచారం అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాలకార్మికులను పనిలో పెట్టుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ సిరిసిల్ల, వేములవాడ సబ్ డివిజనల్‌లో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇటుక బట్టీలు, వివిధ రకాల పరిశ్రమలు, బస్‌స్టేషన్‌లు, ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ కంటం అంజయ్య, సీఐలు నటేశ్, నాగేశ్వర్‌రావు, షీ టీం, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చాలా మంది జీవితాలతో చెలగాటం ఆడిన బీఆర్ఎస్

- కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ చక్రధర్‌రెడ్డి



మాట్లాడుతున్న పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి

సిరిసిల్ల టౌన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు, సెలబ్రెటీల ఫోన్ ట్యాపింగ్‌లు చేసి చాలా మంది జీవితాలతో చెలగాటం ఆడిందని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ కోకన్వీనర్ కనమేని చక్రధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ నిలబడలేని పరిస్థితుల్లో ఉందన్నారు. జోడెడ్ల బండిలా రాష్ట్ర అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని ముందుకు తీసుకెళుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ నాయకుడు జీవన్‌రెడ్డి విమర్శించడం సిగ్గుచేటన్నారు. జీవన్‌రెడ్డిపై అవినీతి, అక్రమాలు ఎన్ని ఉన్నాయో ఒక్కొక్కటిగా చెప్పుకుంటూ పోతే బీఆర్ఎస్ పార్టీ సిగ్గుపోతుందన్నారు. దమ్ము ధైర్యం ఉంటే 18 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతిని నిరూపించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన అవినీతి అక్రమాలపై కేసీఆర్, కేటీఆర్, కవితలపై సీబీఐ, ఈడీ, కేసులు ఉన్నాయని కొందరు జైలుకు కూడా పోయివచ్చారని ఆరోపించారు. జీవన్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేస్తున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో తమ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల ఫోన్ ట్యాపింగ్ చేయడం వదలలేదని మాజీ మంత్రి హరీష్‌రావు, అతని భార్య ఫోన్‌లను ట్యాపింగ్ చేసి సొంత పార్టీ నాయకులను కూడా కేసీఆర్ నమ్మలేదని ఆరోపించారు. సిరిసిల్ల కేంద్రంగా ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడ్డారని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి కేకే మహేందర్‌రెడ్డి ఫోన్లను కూడా ట్యాపింగ్ చేయడం వల్లే ఎన్నికల వ్యూహాలను తెలుసుకోవడం వల్లే సిరిసిల్లలో తమ పార్టీ అభ్యర్థి ఓడిపోయాడన్నారు. దాదాపు 600మంది ఫోన్లను ట్యాపింగ్ చేసిన వ్యక్తిని సిరిసిల్లలోనే పట్టుకున్నారని, న్యాయమూర్తులు, సినిమావాళ్ల ఫోన్‌లను కూడా ట్యాపింగ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ఏ పార్టీ చేయని అవినీతి అక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందని ప్రధానమంత్రి చెప్పారన్నారు. కాళ్లేశ్వరాన్ని ఏటీయంగా మార్చుకున్నారని ప్రధానమంత్రే విమర్శించారన్నారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. రైతులకు సకాలంలో రైతు భరోసా అందించిన ఘనత కాంగ్రెస్‌కు చెందిందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, మాజీ మార్కెట్ కమిటి చైర్మన్ అంజన్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, నాయకులు అన్నల్‌దాస్ భాను, ఎడ్ల తిరుపతి, అంజిరెడ్డి, ఆకుల పరుశురాం, విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, సూర్య, ప్రసాద్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెకు అధికారులు సహకరించాలి

- నోటీసులు అందించిన కార్మిక సంఘాల నాయకులు



జిల్లా వైద్యాధికారికి నోటీసు అందిస్తున్న నాయకులు

8

మెడికల్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం..

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

8

హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు

- ఎస్పీ మహేశ్ బి. గీతే



హోంగార్డులకు రెయిన్‌కోట్స్ అందజేస్తున్న ఎస్పీ మహేశ్ బి గీతే

సిరిసిల్ల క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని హోంగార్డుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేశ్ బి. గీతే అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో హోంగార్డులకు రెయిన్ కోట్స్, ఉలెన్ జాకెట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులు పోలీస్ శాఖతో అంతర్గత భాగమని, పోలీసులతో పాటే నిరంతరం తమ సేవలను అందిస్తున్నారన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్‌లో పోలీసు సిబ్బందితో పాటు హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. క్లిష్ట పరిస్థితులలో కూడా వివిధ బందోబస్తు విధుల్లో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోంగార్డులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సంప్రదించవచ్చని అన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ సిబ్బంది కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతోందని అన్నారు. ఎండనకా, వాననకా రాత్రింబవళ్లు కష్టపడి పనిచేసే సిబ్బందికి అత్యవసర సమయాలలో రెయిన్ కోట్స్, ఉలెన్ జాకెట్స్ ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. విధి నిర్వహణ సమయంలో అప్రమత్తంగా ఉండాలని, క్రమశిక్షణ కలిగిన పోలీస్ శాఖలో పనిచేస్తూ నిబంధనలు ఉల్లంఘిస్తే భవిష్యత్తులో శాఖాపరమైన ఇబ్బందులు ఎదురవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు యాదగిరి, మధుకర్, హోంగార్డులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి


శ్యాం, చక్రి (ఫైల్)

పెద్దపల్లి రూరల్/ కోల్‌సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట గ్రామ శివారులో గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోదావరిఖని పట్టణానికి చెందిన చిలుకల చక్రి (25), శ్యామ్ (24) అనే ఇద్దరు యువకులు పెద్దపల్లి నుంచి గోదావరిఖనికి ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. ఈక్రమంలో అప్పన్నపేట శివారులో గురువారం రాత్రి సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడం ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. చిలుకల చక్రి సింగరేణి బీ గెస్ట్‌హౌస్‌లో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. చక్రి రెండున్నర సంవత్సరాల క్రితం కొత్తగూడెంనకు చెందిన ఒక యువతిని ప్రేమించి పెళ్లి చేసుకోగా 15నెలల కుమారుడు ఉన్నాడు. శ్యాం డిగ్రీపూర్తి చేసి ఇంటివద్దనే ఉంటున్నాడు. ఇద్దరు స్నేహితులు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో విషాదచాయలు అలముకున్నాయి. మృతుడు శ్యాం తండ్రి సోగాల రవీందర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దపల్లి రూరల్ ఎస్‌ఐ మల్లేష్ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరి మృతి

● మరొకరికి గాయాలు

జగిత్యాల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లి వద్ద గురువారం రాత్రి రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న సంఘటనలో జగిత్యాల పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కట్ట ఆదిత్య(19) అనేయువకుడు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ జగిత్యాలరూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన పూదరి శ్రీనివాస్‌కు తీవ్రగాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఆదిత్య తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు కెనాల్‌లో పడి ఒకరి మృతి

కమాన్‌పూర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన గుండేటి స్వామి(42) అనేవ్యక్తి ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడి శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపినవివరాల ప్రకారం.. స్వామి శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై పత్తి చేనుకు వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఎస్సారెస్పీ కాలువలో పడిపోయాడు. చుట్టుపక్కల రైతులు గమనించి వచ్చేసరికి స్వామి తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. మృతుదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వామిభార్య విజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొట్టె ప్రసాద్ తెలిపారు.

ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి

ధర్మపురి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం ఆత్మహత్యాయత్నం చేసిన ధర్మపురి మండలంలోని దొనూర్ గ్రామానికి చెందిన జంగం మల్లేష్(42)అనేవ్యక్తి మృతిచెందినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మల్లేష్ మూడు సంవత్సరాల్లో మూడుసార్లు సర్జరీ చేయించుకోగా రోగం నయం కాలేదని ఆయన పేర్కొన్నారు. ఈనెల 17న మల్లేష్ గడ్డిమందు తాగగా చికిత్సపొందుతూ హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో గురువారం మృతిచెందాడు. మల్లేష్ భార్య గంగవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనారోగ్య కారణంతో ఎస్సారెస్పీ ఉద్యోగి ఆత్మహత్య


ధర్మయ్య(ఫైల్)

జగిత్యాల క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల డివిజన్‌లో నీటి పారుదలశాఖలో లష్కర్‌గా విధులునిర్వహిస్తున్నకండ్లపెల్లి ధర్మయ్య(61) అనారోగ్యకారణాలతో శుక్రవారం తెల్లవారుజామున ఉరివేసు కుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈనెల 30న ధర్మయ్య పదవీవిరమణ ఉండడం ఇంతలోనే ఆత్మహత్యకు పాల్పడడండతో ఆ కుటుంబంలో తీవ్రవిషాదాన్ని నింపింది. మృతుడికిభార్య లక్ష్మితోపాటు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. నా ఆత్మహత్యకు అధికారులు, కుటుంబ సభ్యుల ఒత్తిడి లేదని.. తల తిమ్మిర్లు, విపరీతమైన తలనొప్పి భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నా అంటూ సూసైడ్ నోట్ రాసి పట్టణ శివారులోని లింగంపేట కర్జంకుంట చెరువు వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జగిత్యాల పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భవనం పైనుంచి పడి..
గుర్తుతెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

వేములవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలో ప్రధానరహదారి విస్తరణలో శిధిలాల నుంచి ఇనుప వస్తువులను సేకరించేందుకు వచ్చిన ఓ గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం ఓ భవనంపై నుంచి కిందపడి తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేణుగోపాలస్వామి ఆలయం ఎదురుగా ఉన్న రాజన్న ఆలయానికి సంబంధించిన వాణిజ్యదుకాణాలు విస్తరణలో పోతుండగా భవనం పైన ఉన్న సలాకలను సేకరించేందుకు ఎక్కిన వ్యక్తి ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతడి తలకు, దవడకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో సిరిసిల్ల జిల్లా ఆసుపత్రికి తరలించారు. వేములవాడ పట్టణంలో ప్రధాన రోడ్డు వెడల్పు నేపథ్యంలో ఇరువైపులా భవనాలను, ఇళ్లను పెద్ద ఎత్తున కూల్చివేస్తున్న క్రమంలో శిథిలాలలో లభించే స్టీల్, ఇనుము ఇతర వస్తువుల కోసం వివిధ ప్రాంతాల నుంచి కూలీలు తరలివస్తున్నారు. ఈక్రమంలోనే కూల్చివేసిన ఓ భవనం శిథిలాల నుంచి ఇనుప వస్తువులు సేకరించే క్రమంలో గుర్తుతెలియని వ్యక్తి తీవ్రంగా గాయపడినట్లు తెలుస్తోంది.

ఏపీకే ఫైల్స్‌తో జాగ్రత్త



డౌన్‌లోడ్ చేసుకుంటే ఫోన్ హ్యాక్ అయ్యే అవకాశం

మాల్‌వేర్లతో సైబర్ వల

వాట్సాప్ గ్రూప్‌లో వచ్చిన ఏపీకేలు

చొప్పదండి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలానికి చెందిన ఒక వ్యక్తి ఏర్పాటు చేసిన వాట్సాప్ గ్రూపులో ఎస్‌బీఐ యాప్, పీఎం కిసాన్ పేరిట అండ్రాయిడ్ ప్యాకేజీ కిట్ పేరుతో ఏపీకేలు ప్రత్యక్షమయ్యాయి. వాటిని డౌన్‌లోడ్ చేసిన వారి ఫోన్లు హ్యాక్ అయ్యాయి. ప్రతి రోజు ఏదో ఒక గ్రూపులో ఇలాంటి ఏపీకేలు సైబర్ నేరగాళ్ల పోస్టు చేస్తూనే ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు, బ్యాంక్ ఆఫర్ల పేరుతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్తగా ప్రవేశపెట్టిన పథకాల పేర్లతో సైబర్ నేరగాళ్లు మాల్‌వేర్లను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేస్తున్నారు. వీటి గురించి అవగాహన లేని వారు ఇన్‌స్టాల్ చేసుకుని తమ విలువైన వ్యక్తిగత డాటాతోపాటు నగదును పోగొట్టుకుంటున్నారు. సభ్యులు ఎక్కువగా ఉండే వాట్సాప్ గ్రూపులను నేరగాళ్లు ఎంచుకుని ఏపీకేల లింకులను పోస్టు చేస్తున్నారు. గ్రూపు సభ్యులు తమ ఫోన్ హ్యాక్ అయికచందని తెలుసుకునేలోగానే అతడి నంబర్‌తో ఉన్న మిగతా గ్రూపులలోకి ఏపీకేలను పంపిస్తుంటారు. ప్రముఖ బ్యాంకులు, పీఎం కిసాన్, కామన్ సర్వీస్ సెంటర్‌తోపాటు ఇతర పేర్లతో ఏపీకేలను పార్వర్డ్ చేస్తున్నారు. దీంతో మొబైల్‌లో వాట్సాప్ కూడా పనిచేయదు.

అప్రమత్తంగా ఉండాలి..

మొబైల్‌లో ఏదైనా యాప్‌ను ఇన్‌స్టాల్ చేయాలనుకుంటే గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ స్టోర్ నుంచి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. బయట వ్యక్తులు పంపే లింకులు, ఏపీకేలను డౌన్‌లోడ్ చేసుకోవద్దు. డౌన్‌లోడ్ చేసుకోవాలనుకుంటే గూగుల్ ప్లే స్టోర్‌లో యాప్ ఉందా లేదా చెక్ చేసుకోవాలి. ఇలా కాకుండా నేరగాళ్లు పంపించే లింకులను డౌన్‌లోడ్ చేసుకుంటే నష్టపోయే అవకాశం ఉంది. ప్రభుత్వ పథకాలు, బ్యాంకు యాప్‌లు, సబ్సిడీలు లాంటి యాప్‌ల పేరిట వాట్సాప్ గ్రూపుల్లో సర్క్యులేట్ అయ్యే పోస్టులను పట్టించుకోవద్దు. సరైన అవగాహన లేకుండా లింకులను డౌన్‌లోడ్ చేసుకుంటే వ్యక్తిగత సమాచారం చోరీకి గురయ్యే ప్రమాదం ఉంది.



రెండు బైకులు ఢీ: ఒకరికి గాయాలు

శంకరపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నంమండలం మెట్‌పల్లి గ్రామశివారులో రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. స్థానికులు తెలిపినవివరాల ప్రకారం.. జమ్మికుంట మండలం మాచనపల్లి గ్రామానికిచెందిన సముద్రాల అనిల్ శంకరపట్నం మండలం లింగాపూర్‌లో వారి బంధువుల అంత్యక్రియలకు వచ్చి తిరిగి మాచనపల్లికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మెట్‌పల్లి గ్రామశివారులోని వైన్స్‌దగ్గర రెండుబైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అనిల్‌కు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108లో క్షతగాత్రుడిని హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

కరీంనగర్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): నిర్మల్‌కు చెందిన కె పుష్పలత కొద్దిరోజుల కిందట కరీంనగర్‌రూరల్ మండలం నగునూర్‌లో తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకుంది. కరీంనగర్‌రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు సీఈఐఆర్ టెక్నాలజీ ఆధారంగా ఫోన్‌ను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నిరంజన్‌రెడ్డి ఆమెకు సెల్‌ఫోన్ అందజేశారు. ఈ సందర్భంగా ఫోన్‌ను వెదికిపట్టుకోవడంలో కృషిచేసిన కరీంనగర్‌రూరల్ కానిస్టేబుల్ విశ్వతేజను సీఐ అభినందించారు.

బైక్‌ల చోరీ కేసుల్లో ఆరుగురి అరెస్టు

● 33 ద్విచక్రవాహనాల స్వాధీనం
● వివరాలు వెల్లడించిన సీపీ గౌస్ ఆలం


స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న సీపీ గౌస్ ఆలం

కరీంనగర్ క్రైం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్‌కమిషనరేట్ పరిధిలో ద్విచక్రవాహనాల దొంగతనాల కేసులో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 12 లక్షల 27 వేల రూపాయల విలువైన 33బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం కమిషనరేట్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కరీంనగర్ టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మనగర్‌లో పోలీసులు శుక్రవారం ఉదయం వాహనాల తనిఖీ చేపట్టారు. రెండు ద్విచక్రవాహనాలపై ట్రిపుల్‌రైడింగ్‌లో వెళ్తున్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకుని విచారించగా కరీంనగర్ కమిషనరేట్, సిరిసిల్ల జిల్లా పరిధిలో మొత్తం 33ద్విచక్రవాహనాలు దొంగిలించినట్లు వెల్లడైంది. ఈ దొంగతనాలకు సంబంధించి మొత్తం ఆరు పోలీస్ స్టేషన్లలో 22 కేసులు నమోదయ్యాయి.

● పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు..

- మహబూబ్‌నగర్ జిల్లా, వెంకిచర్లకు చెందిన పంతుల నవీన్(24), గన్నేరువరం, చొక్కారావుపల్లెకు చెందిన పెంటి బాలు (24), సిరిసిల్ల జిల్లా, చందుర్తి మండలం మల్యాలకు చెందిన పెద్ది నాగరాజు(29), ముత్తారం మంథని మండలం, కేశనపల్లి గ్రామానికి చెందిన చిందం సాయి ప్రసాద్ (24), గంగాధర మండలం, లింగంపల్లికి చెందిన తోట మధు (28), సిరిసిల్ల జిల్లా, ఇల్లంతకుంటకు చెందిన కుంబాల సురేష్(35)ను కరీంనగర్ టూ టౌన్, సీసీఎస్ పోలీసులు సంయుక్త ఆపరేషన్‌లో అరెస్టుచేశారు. ప్రజలు వాహనాల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సీపీ గౌస్‌ఆలం తెలిపారు. నిందితులను పట్టుకొని, చోరీకి గురైన 33బైకులు స్వాధీనం చేయడంలో కృషిచేసిన టౌన్‌ఏసీపీ వెంకటస్వామి, సీఐ సృజన్‌రెడ్డి, సీసీఎస్ సీఐ శ్రీనివాస్, కోటేశ్వర్, జాన్‌రెడ్డి, టూటౌన్ ఐడీ పార్టీ సిబ్బంది మల్లన్న, సాయికరణ్, వెంకటి తదితరులకు రివార్డు అందజేసి అభినందించారు.

● పోలీసురాణాలవారీగా కేసుల సంఖ్య, స్వాధీనం చేసుకున్న బైక్‌ల వివరాలు

- కరీంనగర్ వన్ టౌన్ 6 కేసుల్లో 11 బైక్‌లు స్వాధీనం
- కరీంనగర్ టూ టౌన్ 8 కేసుల్లో 9 బైక్‌లు
- కరీంనగర్ త్రీ టౌన్ ఒక కేసులో ఒక బైక్
- కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ 2 కేసుల్లో 2 బైక్‌లు
- కరీంనగర్ కొత్తపల్లి పోలీస్ స్టేషన్ 3 కేసుల్లో 3 బైక్‌లు
- రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పోలీస్ స్టేషన్‌లో 2 కేసులలో 2.
- సరైన వివరాలు లేని మరో 5 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు

పీడీఎస్ బియ్యం పట్టివేత


పట్టుకున్న రేషన్ బియ్యం, రవాణాదారులతో పోలీసులు

గంభీరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న ఐదు క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంతోపాటు రెండు ద్విచక్రవాహనాలను గంభీరావుపేట మండలం ముస్తఫానగర్ గ్రామ శివారులో పట్టుకున్నామని ఎస్ఐ రమాకాంత్ శుక్రవారం తెలిపారు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం భవానీపేటకు చెందిన భూక్య నరేందర్, బానోతు మోహన్‌లు తమ ద్విచక్రవాహనాలపై గ్రామాల్లో తిరుగుతూ ప్రజల నుంచి పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి కామారెడ్డి జిల్లా కేంద్రానికి రవాణా చేస్తున్నారని పేర్కొన్నారు. ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, కానిస్టేబుళ్ల శ్రీను, కరీంలు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో బియ్యం తరలిస్తూ నరేందర్, మోహన్‌లు పట్టుబడ్డారని చెప్పారు. బియ్యం, రెండు వాహనాలను స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. రవాణాదారులు నరేందర్, మోహన్‌లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ రమాకాంత్ వివరించారు.

ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్న గ్రామస్థులు


గ్రామస్థులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన ఇసుక ట్రాక్టర్లు

చందుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : చందుర్తి మండలం మూడపల్లిలో శుక్రవారం ఇసుక ట్రాక్టర్లను గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ వేములవాడ రూరల్ మండలంలోని మల్లారం నుంచి ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుక తరలించే క్రమంలో ఇసుక ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాత్రి, పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా ట్రాక్టర్లు నడవడంతో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయానికి గురికావాల్సి వస్తుందన్నారు. ఇళ్ల మధ్యలో నుంచి ట్రాక్టర్లు వెళ్లడంతో ఇటీవల ఓ బాలుడు ప్రమాదం నుంచి తప్పించుకొని బయటపడ్డాడన్నారు. మైనర్లు ట్రాక్టర్లను నడుపుతున్నారన్నారు. పోలీసులు ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాలని కోరారు. ట్రాక్టర్లవేగాన్ని నియంత్రించాలని గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. గ్రామంలో రోడ్డుపై ట్రాక్టర్లు వెళ్లే సమయంలో దుమ్ము లేవకుండా క్యూరింగ్ పనులు చేపట్టాలన్నారు. దాదాపు అరగంట సేపు ఆందోళన చేపట్టడంతో ఇసుక నిలిచిపోయాయి. సంఘటన స్థలానికి పోలీసులుచేరుకొని గ్రామస్థులతో మాట్లాడడంతో ఆందోళన విరమించారు.

అయస్కాంతంతో నడిచే క్రేన్

● క్రియేటివిటీని అభినందించి స్టేటస్‌లో పెట్టుకున్న కలెక్టర్


విద్యార్థి తయారు చేసిన క్రేన్

గంగాధర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూరుగుపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి అయస్కాంతంతో నడిచేక్రేన్‌ను తయారు చేయగా కలెక్టర్ తనస్టేటస్‌లో పెట్టుకున్నారు. జిల్లాలోని ప్రభుత్వపాఠశాల విద్యార్థుల ప్రయోగాలు జిల్లావ్యాప్తంగా ఏర్పాటుచేసిన గ్రూప్‌లో అప్‌లోడ్ చేస్తారు. బూరుగుపల్లి పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న సాత్విక్ గేర్‌మోటార్, 9వోల్ట్‌బ్యాటరీ, మ్యాగ్నెట్, రిమోట్, క్లిప్స్, పైపులను ఉపయోగించి అయస్కాంత క్రేన్ తయారుచేశాడు. దాని ఉపయోగాల వివరాలు గ్రూప్‌లో అప్‌లోడ్ చేశాడు. విద్యార్థి ప్రయోగాన్ని పరిశీలించిన కలెక్టర్ ప్రయోగ వీడియోను తన స్టేటస్‌లో పెట్టుకునిఎక్సలెంట్‌అని అభినందించారు.

పదో తరగతి విద్యార్థి అదృశ్యం


శ్రీకర్(ఫైల్)

ఇబ్రహీంపట్నం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం మండలం మూలరాంపూర్‌లో పదోతరగతి విద్యార్థి కందుకూరి శ్రీకర్ (15) అదృశ్యమయ్యాడని శుక్రవారం తల్లిదండ్రులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. శ్రీకర్ వేములకుర్తి ప్రభుత్వపాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇంటికిరాలేదు. ఎంత వెతికినా ఆచూకీ తెలియలేదు. శుక్రవారం ఉదయం శ్రీకర్ తల్లిదండ్రులు పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడగాస్కూల్ ప్రారంభం నుంచి బడికిరాలే దని తెలపడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

గొడవలు సృష్టిస్తున్న యువకులకు కౌన్సెలింగ్

● తహసీల్దార్ ఎదుట బైండోవర్

కోల్‌సిటీ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని విఠల్‌నగర్‌లో కొంతమంది యువకులు మద్యం, గంజాయి మత్తులో రెండురోజులక్రితం రోడ్డుపై గొడవలు పడగా శుక్రవారం గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. విఠల్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు రెండురోజుల క్రితం స్నేహితుని పుట్టినరోజు వేడుకలవిషయంలో గొడవపడ్డారు. కత్తులు పట్టుకుని బూతులుతిడుతూ భయభ్రాంతులకు గురిచేశారు. దీనికి సంబంధించి వీడియోలు వైరల్ అయ్యాయి. సీఐ ఇంద్రసేనారెడ్డి సదరుయువకులను వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. తల్లిదండ్రులు ఎప్పుడూ పిల్లలను గమనిస్తుండాలని, వారు ఎవరితో స్నేహం చేస్తున్నారు.. వారి స్నేహితుల ప్రవర్తనలు, అలవాట్లగురించి తెలుసుకోవాలని సూచించారు. అనంతరం యువకులను ముందస్తు చర్యల్లో భాగంగా ఒక సంవత్సరంపాటు ఎలాంటి చెడుప్రవర్తన చేయకుండా రామగుండం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగ అరెస్టు

● నాలుగు తులాల బంగారం రికవరీ


దొంగను అరెస్టు చూపుతున్న సీఐ ప్రదీప్‌కుమార్

గంగాధర, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి వృద్ధురాలి బంగారం ఎత్తుకెళ్లిన దొంగను అరెస్టు చేసినట్లు చొప్పదండి సీఐ ప్రదీప్‌కుమార్ తెలిపారు. గంగాధర పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 14న వేములవాడ మండలం నమిలిగుండుపల్లికి చెందిన వజ్రమ్మ(80) గంగాధర బస్ స్టాండ్‌లో దిగి ఆసుపత్రికి వెలుతోంది. సిద్దిపేటకు చెందిన అల్లెపు క్రిష్ణ నేను మీ గ్రామ కార్యదర్శినంటూ పరిచయం చేసుకున్నాడు. పింఛన్ ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి వజ్రమ్మ వద్దనున్న బంగారు గొలుసు, చెవి కమ్మలు తీసిస్తే ఫోటో దింపుతానని నమ్మబలికాడు. నమ్మిన వజ్రమ్మ తనవద్దనున్న బంగారు గొలుసు, చెవి కమ్మలు తీసి నిందితుడి చేతిలో పెట్టింది. ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకురావాలని వజ్రమ్మను పంపించి బంగారంతో ఉడాయించాడు. వృద్ధురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై వంశీక్రిష్ణ సీసీ పుటేజీల ఆధారంగా విచారణ చేపట్టారు. శుక్రవారం అదేవ్యక్తి తిరిగి గంగాధర బస్ స్టాండ్‌లో మరోమహిళ వద్ద బంగారం చోరీ చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు పట్టుకు న్నారు. నిందితుడి వద్ద నుంచి నాలుగు తులాల బంగారం రికవరీ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిపై నర్సంపేట, బాన్సువాడతోపాటు రాష్ట్రవ్యాప్తంగా 86కేసులున్నట్లు తెలిపారు. కేసు చేదించుటలో పాల్గొన్న గంగాధర ఎస్సై వంశీక్రిష్ణ, సీసీఎస్ ఎస్సైలు శ్రీనివాస్, నాగరాజుతోపాటు పోలీసులను సీఐ అభినందించారు.

వంతెన నిర్మాణానికి మోక్షమెప్పుడో?

● ప్రతి ఏటా వానాకాలం కష్టాలే
● ఏళ్లుగా ఎదురుచూపులు..


పాతర్లపల్లిలో తెగిపోయిన చెక్‌డ్యాం (ఫైల్)

ఇల్లందకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఇల్లందకుంట మండలంలోని పాతర్లపల్లె వాగుపై వంతెన నిర్మాణం కలగానే మారింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు గ్రామ ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు తప్పవు. మల్యాల గ్రామం నుంచి నిత్యం వాగు పారుతుంది. భారీ వర్షాల కారణంగా చిన్నగా వంతెన ఉండడం వల్ల పైనుంచి నీరు ప్రహించడంతో పాటు సమీపంలో ఉన్నటువంటి గ్రామపంచాయతీ, ఇళ్లలోకి నీరుచేరి గ్రామానికి రాకపోకలు స్తంభించి పోతాయి. ఈ సమస్య ఏళ్ల గడుస్తున్నా పరిష్కారం కావడం లేదు. ప్రతి ఏటా వర్షాల కారణంగా వాగు ఉప్పొంగినప్పుడు మట్టి కొట్టుకపోవడం, కల్వర్టు మీద నుంచి ప్రవహించడం జరుగుతుంది. ఆ సమ యంలో అధికారులు వచ్చి అప్రమత్తంగా ఉండాలని చెబుతూ చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతానికి ఎమ్మెల్యే ఈటల రాజేందర్ గెలిచిన తర్వాత హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతానని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత పాలకులు సైతం ఈ గ్రామ వంతెనపై స్పందన లేదు.

గ్రామస్థులు ప్రతిఏటా వంతెన సమస్యను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఆచరణలోకి రావడం లేదు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించి నిర్మాణపనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

● 25 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం.

- కోడం శంకర్, గ్రామస్థుడు, పాతర్లపల్లి



గ్రామానికి వంతెన నిర్మిస్తారని 25ఏళ్లుగా ఎదురుచూస్తున్నాం. మా బాధలు ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రజాప్రతినిధులు వెంటనే వంతెన నిర్మాణం కోసం నిధులు కేటాయించి పనులు ప్రారంభిస్తే బాగుంటుంది.

● వానాకాలం వచ్చిందంటే భయపడుతాం

- బైరెడ్డి రమణారెడ్డి, గ్రామస్థుడు, పాతర్లపల్లి



ప్రతిఏటా వానాకాలం వచ్చిందంటే వాగు ఉప్పొంగడం వల్ల భయపడాల్సి వస్తుంది. వాగు ఉప్పొంగడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోతాయి. రవాణాపూర్తిగా స్తంభించి పోతుంది. మా గ్రామానికి వంతెన నిర్మాణ పనులకు నిధులు కేటాయించి పనులు ప్రారంభించాలి.

పార్లమెంట్ నియోజకవర్గం

అభివృద్ధికి కృషి

కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

కరీంనగర్ అర్బన్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధి కోసం పార్టీలకతీతంగా కలిసి పని చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు రూ.77.2 కోట్ల అంచనాతో చేపట్టిన



ఫోర్‌లైన్ విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంతోపాటు హుస్నాబాద్‌లో ఆస్పత్రి, తదితర కార్యక్రమాలకు రావాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆహ్వానించారని, ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం ఛండీగఢ్ వెళ్లాల్సివచ్చిందని తెలిపారు. దీంతో హుస్నాబాద్ కార్యక్రమాలకు హాజరు కాలేక పోయానని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున తనను ఆహ్వానించిన మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు. అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహకు ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రిగా కొనసాగుతున్న తాను కరీంనగర్ పార్లమెంట్ ప్రజల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు సైతం రాష్ట్ర ప్రభుత్వం నుంచి పెద్ద ఎత్తున నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గం పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజక వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

పెద్దపల్లి ఆర్వోబీ వద్ద విరిగిన క్లస్టర్



కూనారం రోడ్డులో ఆర్వోబీ పనులు చేపడుతుండగా విరిగి పోయిన క్లస్టర్

- ఆరు గంటల పాటు రైళ్ల రాకపోకలకు అంతరాయం
- ఆయా స్టేషన్లలో నిలిచిన రైళ్లు.. పలు రైళ్లు పాక్షికంగా రద్దు
- పునరుద్ధరణతో ఆలస్యంగా నడిచిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్

పెద్దపల్లి/పెద్దపల్లి రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో కూనారం రోడ్డులో నిర్మిస్తున్న ఆర్వోబీ దగ్గర క్లస్టర్ విరిగిపోయి గడ్డర్లు కుంగడంతో ఖాజీపేట-బల్లార్షా రూట్‌లో ఆయా రైల్వేస్టేషన్లలో రైళ్లు ఎక్కడికక్కడే నిలిచి పోగా, కొన్ని రైళ్లను కొన్ని స్టేషన్ల వరకే పరిమితం చేశారు. ఆర్వోబీ నిర్మాణంలో భాగంగా రెండో లైన్‌లో రైల్వే ట్రాక్ మీదుగా ఐరన్ గడ్డర్లను అమర్చి దాని మీదుగా వంతెన శుక్రవారం ఉదయం ఐదు గంటల నుంచి అమర్చే పనిని ప్రారంభించారు. ఒక క్లస్టర్‌లో గడ్డర్ లోడ్‌కు సగానికి పైగా విరగడాన్ని గమనించిన ఇంజనీరింగ్ అధికారులు వెంటనే లైన్ గుండా రైళ్ల రాకపోకలను నిలిపివేయాలని దక్షిణ మధ్య రైల్వే అధికారులకు సమాచారం ఇచ్చారు. ఆ వెంటనే మరమ్మతు పనులను చేపట్టారు. ఉదయం ఆరు గంటల నుంచి ఎక్కడికక్కడే రైళ్లను నిలిపివేశారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్ స్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు రైళ్లు, గూడ్స్ రైళ్లు నిలిచిపోయాయి. ఉదయం 11:50 గంటలకు మరమ్మతు పనులు పూర్తికావడంతో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.



రాఘవాపూర్ రైల్వే స్టేషన్‌లో నిలిచి పోయిన రైళ్లు

● రైళ్ల రాకపోకలకు అంతరాయం..

పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో జరుగుతున్న ఆర్వోబీ పనుల వల్ల క్లస్టర్ విరిగి పోయి గడ్డర్లు కుంగడంతో ఖాజీపేట- బల్లార్షా లైన్‌లో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంటర్ సిటీ, సిర్పూర్ కాగజ్‌నగర్, రామగిరి, సింగరేణి మెమో ఎక్స్‌ప్రెస్ రైళ్లను పాక్షికంగా రద్దు చేయగా, దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు యథాతథంగా నడిచాయి. సికింద్రాబాద్ నుంచి నాగపూర్‌కు నడిచే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సికింద్రాబాద్ నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు బదులు మూడు గంటల ఆలస్యంగా సాయంత్రం నాలుగు గంటలకు బయలు దేరింది. అలాగే రైలు నంబర్ 17011/12 హైదరాబాదు నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్‌కు అక్కడి నుంచి బీదర్ వరకు వెళ్లే ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు పోత్కపల్లి వరకే నడిపించారు. రైలు నంబర్ 12757/58 సికింద్రాబాద్ నుంచి సిర్పూర్‌కాగజ్ నగర్ నుంచి సికింద్రాబాద్ కాగజ్‌నగర్ వరకు నడిచే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలును పాక్షికంగా ఇరువైపులా రద్దు చేశారు. ఈ రైలును కేవలం కాజీపేట నుంచి సికింద్రాబాద్ మధ్యే నడిపించారు. రైలు నంబర్ 17033 భద్రాచలం రోడ్డు నుంచి బల్లార్షా వైపు వెళ్లే సింగరేణి మెము ఎక్స్‌ప్రెస్ రైలును వరంగల్ నుంచి బల్లార్షా మధ్య పాక్షికంగా రద్దు చేశారు, 17034సింగరేణి రైలు వరంగల్ నుంచి భద్రాచలం రోడ్డు వరకు నడిపించారు. రైలు నంబర్ 17003 కాజీపేట నుంచి సిర్పూర్ వైపు వెళ్లే మెమో ఎక్స్‌ప్రెస్ రైలును పొత్కపల్లి వరకే నడిపించి పోత్కపల్లి నుంచి సిర్పూర్ టౌన్ వరకు పాక్షికంగా రద్దు చేశారు. బోధన్ నుంచి సిర్పూర్ టౌన్‌కు అక్కడి నుంచి బోధన్‌కు నడిచే పుష్ పుల్ రైలును పూర్తిగా రద్దు చేశారు. సికింద్రాబాద్ వైపు వెళ్లే రైలు నంబర్ 17234 భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్ రైలును పాక్షికంగా కాజీపేట నుంచి సికింద్రాబాద్ మధ్య రద్దు చేశారు. ఇదే రైలు 17202 గుంటూరు వైపు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌గా కాజీపేట నుంచి నడిపించారు.

జమ్మికుంటలో రెండు గంటలు నిలిచిన ఎక్స్‌ప్రెస్ రైళ్లు

జమ్మికుంట: జమ్మికుంట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచిపోయాయి. పెదపల్లిలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబి) నిర్మాణ పనులు జరుగుతుండగా ఒక పిల్లర్ కుంగింది. దీంతో జమ్మికుంటలో తెలంగాణ, రాజదాని ఎక్స్‌ప్రెస్‌లను నిలిపివేశారు. సుమారు రెండు గంటల పాటు నిలిపి వేయ డంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు. రాఘవపురంలో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, ఉప్పల్‌లో ఇంటర్సిటీ ఎక్స్‌ప్రెస్‌లు నిలిచి పోగా ప్రయాణీకులు గంటల కొద్దీ రైల్వేస్టేషన్‌లో వేచి చూశారు. రైళ్లు ఆలస్యంగా నడుస్తుండటంతో కొంత మంది ఇళ్లకు తిరుగుముఖం పట్టారు.

శాతవాహన యూనివర్సిటీలో

తీజ్ ఉత్సవాలు



ఉత్సవాలలో పాల్గొన్న వీసీ ఉమేష్‌కుమార్

గణేశ్‌నగర్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వ విద్యాలయంలో బంజారాల సంప్రదాయమైన తీజ్ ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన ఉత్సవాలను యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఉమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తీజ్ ఉత్సవాలు బంజారాల సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకని అన్నారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సూరేపల్లి సుజాత, ఓఎస్‌డీ టు వీసీ డాక్టర్ హరికాంత్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

ఖని బస్టాండ్ నుంచి యాదగిరి గుట్టకు ప్రత్యేక బస్సు

జెండా ఊపి ప్రారంభించిన డీఎం నాగభూషణం



పుణ్యక్షేత్ర బస్సుకు జెండా ఊపుతున్న డీఎం నాగభూషణం

కళ్యాణ్‌నగర్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): యాత్రికుల కోసం పుణ్య క్షేత్రాలకు ఇటీవల ఆర్టీసీ టూర్ ప్యాకేజీతో సర్వీసులను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఐదు గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి యాదగిరిగుట్ట, స్వర్ణదేవాలయానికి సూపర్ లగ్జరీ సర్వీసును ఏర్పాటు చేయగా డిపో మేనేజర్ నాగభూషణం జెండా ఊపి ప్రారంభించారు. 37మంది భక్తులతో ఈ బస్సు మొదట యాదగిరిగుట్టలో లక్ష్మీ నరసింహస్వామి దర్శనం అనంతరం స్వర్ణగిరిలోని వెంకటేశ్వరస్వామి పుణ్యక్షేత్రాన్ని సందర్శించనున్నట్టు తెలిపారు. దర్శనం అనంతరం రాత్రి 10 గంటలకు గోదావరిఖనికి చేరుకుంది. భక్తుల వెంట కో ఆర్డినేటర్లు కేఆర్ రెడ్డి, ఎస్ఎస్ మూర్తి ఉన్నారు. అసిస్టెంట్ మేనేజర్ గీత కృష్ణ పాల్గొన్నారు.

కొండగట్టులో స్థానికులకు సులువైన దర్శనం కల్పించాలి



ఈవో శ్రీకాంత్‌రావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్థులు

మల్యాల, జూన్ 27(ఆంధ్రజ్యోతి): ముత్యంపేట గ్రామస్థులకు కొండగట్టు అంజన్న దర్శనం అసౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఈవో శ్రీకాంత్‌రావుకు వినతిపత్రం అందజేశారు. పలుమార్లు స్థానికుల దర్శన సమయంలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాటిని పరిష్కరించాలని ఈవోతో అన్నారు. అలాగే దేవస్థానం పరిధిలో మరింత అభివృద్ధికి దేవస్థానం తరుపున పాటుపడాలని, భక్తులు కొండపై ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సమన్వయ సంఘం అధ్యక్షుడు సామ మహిపాల్‌రెడ్డి, ముల్క మల్లయ్య, త్రినాథ్, సంజీవ్, రాజేశ్, అజయ్‌రావు, అంజన్‌రావు, రమేశ్, గంగమల్లు, పన్నాటి మల్లేశం, గుర్రం మల్లేశంగౌడ్, మధు, గౌతం, శ్రీనివాస్ ఉన్నారు.

కల్వర్టు పనులను అడ్డుకున్న రైతులు

కోనరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : సుద్దాల ఎక్ రోడ్డు నుంచి మంగళపల్లె వరకు చేపట్టిన తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా చేపట్టిన కల్వర్టు పనులను సుద్దాల-మంగళపల్లి రైతులు అడ్డుకున్నారు. సుద్దాల ఎక్స్ రోడ్డు నుండి మంగళపల్లి గ్రామాల మధ్యన కల్వర్టు తొలగించి గతంలో కంటే భారీ పైపులు వేయడం వల్ల పంట చేనులు కొట్టుకపోతాయని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో ఉన్న కల్వర్టు వల్ల భారీ వర్షాలకు నష్టపోయామని, మరింత పెద్ద పైపులు వేయడం వల్ల పంటలు చేతికి రావని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న మాదిరిగా నిర్మిస్తే మల్కపేట రిజర్వాయర్ విడుదల చేసిన నీరే కాకుండా వర్షాకాలపు నీరు కూడా గతంలో పోవడం వల్ల మంగళపల్లె బతుకమ్మ కుంట నుంచి మారుపాక చెరువులోకి వెళ్లిపోతాయని అన్నారు. అలాకాకుండా సదరు కాంట్రాక్టర్ ఇప్పుడు చేపట్టే కల్వర్టు పనుల్లో పెద్ద పైపులు వేయడం వల్ల సుమారు 15 ఎకరాలు పంటలు కొట్టుకపోతాయని అన్నారు. అధికారులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ స్పందించి రైతులకు నష్టం జరగకుండా కల్వర్టు పనులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బోనాల పండుగలో వృత్తి కళాకారుల

ప్రదర్శనలకు ఆహ్వానం

కరీంనగర్ అర్బన్, జూన్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో బోనాల పండుగలో ఈ నెల 25 నుంచి 29 వృత్తి కళాకారుల ప్రదర్శనలు, ఉత్పత్తుల అమ్మకాలు నిర్వహించేవారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎం అనిల్ ప్రకాశ్ కిరణ్ ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహం, ఐమాక్స్ పక్కన ఓపెన్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన, అమ్మకాల కోసం జిల్లాలోని కుమ్మరి, చేనేత, మేదరి, వడ్రంగి, పూసల తదితర బీసీ వృత్తి కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిని కొనుగోలు చేసి వృత్తి కళాకారులను ప్రోత్సహించేందుకు ప్రదర్శనను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎంబీసీ నిరుద్యోగ యువతకు వివిధ నైపుణ్య శిక్షణ

కరీంనగర్ అర్బన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): తెలంగాణ అత్యంత వెనుబడిన తరగతుల అభివృద్ధి సంస్థ(టీజీఎంబీసీడీసీ) ఆధ్వర్యంలో ఎంబీ సీ నిరుద్యోగ యువతీ యువకులకు వివిధ నైపుణ్యాలను పెంపొందించేం దుకు హైదరాబాద్‌లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు టీజీఎం బీసీడీసీ ముఖ్యకార్యనిర్వహణ అధికారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీ నుంచి జూలై 12వ తేదీ వరకు 15 రోజులు ఆన్‌లైన్ వెబ్‌సైట్ tgobmms.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారాలను సంబంధిత ధ్రువపత్రాలను జతపరచి, జిల్లాల్లోని బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సమర్పించాలన్నారు. అభ్యర్థులకు 4 రోజుల శిక్షణ అందిస్తారని, ట్రావెలింగ్ అలవెన్స్ భోజన, వసతి సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు.

పీఎం కిసాన్ కోసం ఎదురు చూపులు

గన్నేరువరం, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాల్లో ఒకటి ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం. ఈ పథకంలో చేరిన రైతులకు పంటల పెట్టుబడికి మూడు విడతలుగా ప్రతి నాలుగు నెలలకు ఒకసారి 2 వేల చొప్పున మొత్తం సంవత్సరానికి 6 వేల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తుంది. చిన్న, సన్నకారు రైతులు కుటుంబంలో ఒక్కరికి మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది. ఈ పథకంలో చివరగా 2019 మార్చి వరకు చేరిన రైతులకు మాత్రమే పీఎం కిసాన్ డబ్బులు పడుతున్నాయి. ఆ తరువాత నుండి ఇప్పటి వరకు ఎంత మంది రైతులు దరఖాస్తు చేసుకున్నా పథకానికి ఎంపిక కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకానికి 2019 మార్చి వరకే కటాఫ్ తేదీని పెట్టడంతో అనేక మంది రైతులు ఈ పథకంలో చేరేందుకు ఎదురుచూస్తున్నారు. గన్నేరువరం మండలంలో మొత్తం 7,542 మంది రైతులు ఉండగా ప్రస్తుతానికి 3,055 మంది రైతులు మాత్రమే పీఎం కిసాన్ పథకం ద్వారా పంట పెట్టుబడి సాయాన్ని పొందుతున్నారు. దీంతో మిగతా రైతులు కటాఫ్ తేదీ పెంపు కోసం ఎదురుచూస్తున్నారు.

కేంద్రం కొత్తగా కటాఫ్ తేదీ ప్రకటించలేదు: మండల వ్యవసాయ అధికారి కిరణ్మయి



పీఎం కిసాన్ పథకంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్ట కపోవడంతో అనేక మంది అర్హులైన రైతులు పథకానికి ఎంపిక కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకానికి అర్హులైన రైతులను ఎంపిక చేసేందుకు ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి కటాఫ్ తేదీని పెట్టింది. 2019 మార్చిలో కటాఫ్ తేదీ అమలు చేసాక మళ్లీ ఆరు సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ కటాఫ్ తేదీని పెంచ లేదు.

అత్తపై హత్యాయత్నం.. అల్లుడికి ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, జూన్ 27(ఆంధ్రజ్యోతి): అత్తపై హత్యాయత్నానికి పాల్పడిన ఎల్లారెడ్డిపేట మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌కు చెందిన వేముల శేఖర్(32)కు ఒక ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 500 జరిమానా విధిస్తూ శుక్రవారం సిరిసిల్ల సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి తీర్పు వెల్లడించారు. ఎస్పీ మహేశ్ బి. గీతే వివరాల ప్రకారం.... 2021లో తన అత్త వేముల శాంతవ్వపై దాడి చేసి కొట్టి కత్తితో పొడిచి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ మేరకు బాధితురాలు ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ బన్సీలాల్ కేసు నమోదుచేశారు. ఈ కేసులో పోలీసులు చార్జీ షీట్ దాఖలు చేయగా కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రవీంద్రనాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పీపీ వేముల లక్ష్మీప్రసాద్ వాదనలు వినిపించగా కేసుపూర్వాప రాల ను పరిశీలించిన సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మణాచారి నిందితుడికి ఏడాది జైలు శిక్ష రూ. 500జరిమానా విధించారని ఎస్పీ మహేశ్ బి. గీతే తెలిపారు.

- అతివల అరచేతికి అందం
- ఆరోగ్యానికీ మంచిది
- ఆషాఢ మాసం ప్రత్యేకం

గోరింటా.. పండింది



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

తొలకరి జల్లులతో వచ్చే ఆషాఢం.. అతివల అందాన్ని పెంచే గోరింటను తెస్తుంది. తొలకరితోనే గోరింట చిగురిస్తుంది. ఆషాఢ మాసంలో అతివలు చేతులు, కాళ్లకు గోరింటాకు పెట్టుకోవడం ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు. కొత్తగా పెళ్లయిన యువతులు సంప్రదాయంగా పాటిస్తారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు గోరింటాకు పెట్టుకొని మురిసిపోతారు. గోరింటాకు పెట్టుకోవడం అయిదోతనంగా, ముత్తయిదవుల నమ్మకంగా, పెళ్లికాని అమ్మాయిలకు గోరింట బాగా పండితే మంచి మొగుడు వస్తాడని భావిస్తారు. ఇందుకోసం మహిళలు గోరింటతో ప్రత్యేక డిజైన్లు వేసుకోవడం కనిపిస్తుంది.

మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా మహిళలు గోరింటాకుతో ఆకర్షణీయమైన డిజైన్లను వేసుకోవడాని పోటీపడుతారు. కొత్తగా పెళ్లయిన యువతులు గోరింటాకుతో సంబరాలు జరుపుకుంటారు. డిజైన్లు వేయడానికి బ్యూటీ పార్లర్లకు వెళ్తుంటారు. మరో వైపు అందంతో పాటు గోరింటాకు ఆరోగ్యాన్ని కూడా కలిగిస్తుంది. గోరింటాకు స్వయంగా తయారుచేసుకోవడాని ఇష్టపడుతారు. పల్లెల్లో లేలేత ఆకులు తెచ్చు కొని రోటిలో మెత్తగా రుబ్బుకొని చింతపండు, పెరుగు కలుపుకొని చేతులకు అందంగా చందమామ, చుక్కల నెలవంక, బంతిపువ్వు, వేళ్ల చుట్టూ గొడుగులు పెట్టుకుంటారు. పాదాలకు పారాణి పెట్టుకుంటారు.

గోరింటలో ఔషధ గుణాలు..

గోరింటాకు కేవలం అందం కోసమే కాకుండా ఎన్నో ఔషధ గుణాలు కూడా ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. అతివల చేతులు నీటిలో నానడంతో పుండ్లు, ఎలర్జీ వస్తుందని గోరింటాకులో యాంటీబయాటిక్ లక్షణాలు ఉండడం వల్ల కాళ్లకు, చేతులకు క్రిములు దరిచేరనీయకుండా ఉంచుతాయని చెబుతారు. అంతే కాకుండా రక్తపోటు కూడా తగ్గిస్తుందని చెబుతారు. నువ్వుల నూనెలో గోరింటాకు వేసి మరిగించి తలకు రాసుకుంటే కాలేయ రోగాలకు, నోటిపూతను తగ్గిస్తుందని చెబుతారు. కీళ్లనొప్పులు, వాపు కూడా గోరింటాకుతో తగ్గిపోతుందని చెబుతారు.





మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

కోల్‌సిటీటౌన్, జూన్ 27(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈ నెల 29న జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళనానికి తరలిరావాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపల్లి సతీష్ పిలుపునిచ్చారు. గోదావరిఖని రామగుండం కార్పొరేషన్ కార్యాలయం వద్ద శుక్రవారం వారు మాట్లాడారు. ఈ నెల 29న కరీంనగర్‌లోని అల్గునూర్ ఏఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఈ ఆత్మీయ సమ్మేళనం జరుగుతుందని తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, శాసన సభ్యులు హాజరవుతారని తెలిపారు. ఉదయం 10 గంట లకు కోర్టు చౌరస్తా అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జాతీయ కార్యదర్శి కొంకటి లక్ష్మణ్, ఆలయ ఫౌండేషన్ నాయకులు మిట్టపల్లి రాజేందర్, బచ్చల రాజు, విజయ్, పోచయ్య, రవి, గాలిపల్లి సతీష్, రమేష్, జీవన్, చిరంజీవి, సది, కిష్టయ్య పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నం : వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22వ తేదీన తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పురుగుల తాగి ఆత్మహత్యాయత్నం చేసిన తంగళ్లపల్లి మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన వేల్పుల కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు. వ్యవసాయ భూమి విషయంలో తనపై కేసు నమోదు పై ఆరా తీయడానికి వచ్చి తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి బెదిరింపులకు పాల్పడటంతో సిరిసిల్ల కోర్టు అనుమతితో కృష్ణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న కన్న రమేష్

సుల్తానాబాద్, జూన్ 27: (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లిలో బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీలకు జరుగుతున్న అన్యాయం గురించి, బీసీల హక్కుల సాధన గురించి, రిజర్వేషన్ల అంశం గురించి చర్చించారు. అనంతరం కన్న రమేష్ మాట్లాడుతు రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన బీసీలకు అన్నిపార్టీల వారు అవకాశాలు కల్పించాలని కోరారు. ఉద్యోగ అవకాశాల్లో కూడా ఇదే విధంగా రిజర్వే షన్లను అమలు చేయాలన్నారు. త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవరు ఎక్కువ మంది బీసీలకు అవకాశాలు కల్పిస్తే వారికి మద్దతు తెలపాలని నిర్ణయించారు. ప్రధాన రాజకీయ పార్టీలు బీసీలకు తగిన అవకాశాలు కల్పించి రాజకీయంగా ఎదిగేలా చూడాలన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య, నాయకులు కుందేళ్ల తిరుపతి, మాదాసు గోవర్ధన్, ఆది కోటేశ్వర్‌రావు, కుందేళ్ల కనుకయ్య, సంకరి సంపత్, ఓదెలు, మహేష్, గున్నాల ప్రవీణ్, గౌతమ్, రజనీకాంత్, మారంపల్లి సంపత్, పయ్యావుల సంపత్ పాల్గొన్నారు.

దుమాల ఈఎంఆర్ఎస్‌లో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఎల్లారెడ్డిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో వైద్యాధికారి సారియాఅంజుమ్ ఆధ్వర్యంలోని వైద్య సిబ్బంది శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 55 మంది విద్యార్థినులకు పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఇద్దరికీ రక్త నమూనాలను సేకరించారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ పద్మజ, హెల్త్ అసిస్టెంట్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత

ఎల్లారెడ్డిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం అందజేశారు. ఆరుగురు లబ్ధిదారులకు రూ.1.17 లక్షల చెక్కులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు సందీప్, వెంకటనర్సింహారెడ్డి, రాజం, పర్శరాములు, నర్సింలు, వెంకట్‌రెడ్డి, శివరామకృష్ణ, పవన్‌గౌడ్, రాజు, బ్రహ్మచారి, రమేశ్, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

ఇల్లంతకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యపరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారి కట్ట రమేష్ సూచించారు. మండలంలోని గాలిపెల్లి గ్రామంలో శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా వైద్యసిబ్బంది ర్యాలీ నిర్వహించారు. గ్రామపంచాయితీ కార్యాలయంలో వైద్యశిబిరం కొనసాగింది. శిబిరంలో 96మందికి పరీక్షలు నిర్వహించి లక్షణాలు ఉన్న 22మంది నుంచి స్పుటం సేకరించి వైద్యపరీక్షలకు పంపారు. ఈసందర్భంగా వైద్యాధికారి మట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి లేకపోవడం, బరువు తగ్గడం తదితర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసిబ్బందిని కలువాలన్నారు. క్షయవ్యాధి నిర్ధారణ అయితే ప్రభుత్వం ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు పౌష్టిక ఆహారం కోసం నెలకు రూ 1000 ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జేత్య, నవనీత, జవహర్, శోభారాణి, కవిత తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో మొహర్రం వేడుకలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంతో పాటు బండలింగంపల్లి, నారాయణపూర్, రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్ తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పీరీల మసీదుల్లో భక్తిశ్రద్ధల నడుమ ప్రతిష్ఠించారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వారం రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నాయని కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

మార్కెట్ కమిటీ డైరెక్టర్‌ను పరామర్శించిన ప్రభుత్వ విప్

రుద్రంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాడిశెట్టి ప్రభాకర్ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో శుక్రవారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్యం పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గట్ల మీనయ్య, తర్రె మనోహర్, ఎర్రం గంగనర్సయ్య, గడ్డం శ్రీనివాస్‌రెడ్డి కెసిరెడ్డి నర్సారెడ్డి, వడ్ల నారాయణ, మాడిశెట్టి అభిలాష్, తర్రె లింగం, స్వర్గం పరాందామ్, నారవేణి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

చందుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం ఎన్గల్ గ్రామంలో ఇటీవల మృతిచెందిన లాండే రాఘవి, బండపల్లి గడ్డం చిన్న సత్యరెడ్డి కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ సీనియర్ నేత ఏనుగు మనోహర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు తిరుపతి, జనార్ధన్, మనోహర్, తిరుపతి, గణేష్, రాములు, భగవాన్‌లు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

చందుర్తి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఎల్.రాధా అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యాలయ ఆవరణలో గల నూతనంగా నిర్మించిన ఇంకుడు గుంతను, వంట గది, పరిసరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల నాణ్యమైన భోజనంతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ప్రదీప్ కుమార్, కేజీబీవీ ప్రత్యేక అధికారిని కల్పన, ఎంపీపీ సిబ్బంది రమాదేవి, పాల్గొన్నారు.

7న ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేయాలి



ఎగ్లాస్‌పూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కోనరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయాలి ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి అన్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్పూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ నాయకుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు పద్మభూషణ్ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు జూలై 7న గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేసేందుకు ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ గద్దెల నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో అక్కినపల్లి సురేష్, కొమ్ము రాజశేఖర్, ఐలయ్య, నర్సయ్య, మధు, వెంకటేష్, ప్రతాప్, రాములు, లచ్చయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఊరూరా జెండా గద్దెలను ఏర్పాటు చేయాలి

ఇల్లంతకుంట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఊరూరా ఎమ్మార్పీఎస్ జెండా గద్దెల నిర్మాణాలు చేపట్టాలని మండలశాఖ అధ్యక్షుడు మంద రాజుమాదిగ సూచించారు. మండలంలోని రామోజిపేట గ్రామంలో జెండా గద్దె నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 7న ఆవిర్భావదినోత్సవం ఉన్నందున అన్ని గ్రామాలలో జెండాను ఎగురవేయాలన్నారు. గ్రామాలలో పండుగ వాతావరణం నెలకొనేలా ఎమ్మార్పీఎస్ నాయకులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు బెజ్జంకి రవి, నాయకులు సావనపెల్లి నాంపెల్లి, కాసుపాక సురేష్, వెంకటేశం, పసుల వెంకటి, ఆంజనేయులు, మధు, రవి, తిరుపతి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కారును తొలగించండి..

ఎల్లారెడ్డిపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామశివారులో ఈనెల 26న రోడ్డు పక్కనే ఉన్న రాజయ్య ఇంటిలోకి దూసుకెళ్లిన ఓ కారు శుక్రవారం అలాగే ఉండిపోయింది. కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలానికి చెందిన కారు డ్రైవర్ కాశాగౌడ్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇరు వర్గాలతో చర్చించారు. ఇంటి ముందు ప్రమాదానికి గురైన కారు ఉండిపోవడం వల్ల తాము ఆరు బయటే ఉండాల్సిన పరిస్థితి నెలకొందని కుటుంబ సభ్యులు వాపోయారు. తమకు న్యాయం చేసి ఇంటి ముందు ప్రమాదానికి గురైన కారును తొలగించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఇల్లంతకుంట, జూన్ 27 : రోడ్డుప్రమాదంలో ముస్కానిపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి సంజీవరెడ్డి (54) అనే సైక్లిస్ట్ మృతిచెందాడు. ఎస్సై సిరిసిల్ల అశోక్ సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మెడికల్ హబ్‌గా తెలంగాణ రాష్ట్రం

- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



చెక్కులను పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రం మెడికల్ హబ్‌గా మారిందని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యుడు ఆది శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వేములవాడ పట్టణ, అర్బన్ పరిధిలో అర్హులైన 76 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 18లక్షల 80వేల రూపాయల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యారోగ్య రంగంలో తెలంగాణ సాధిస్తున్న ప్రగతి, ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిదాయకంగా మారిందన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి పదవీ బాధ్యతలు చేపట్టగానే ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి ప్రజారోగ్యంపై ప్రజా ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని చాటుకున్నారన్నారు. ఇప్పటికే ఈ ప్రాంతంలో ఎల్‌వోసీల ద్వారా దాదాపు 20కోట్ల రూపాయలు అందించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత ప్రభుత్వ పథకాలను రద్దు చేయకుండా అమలు చేస్తూ అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుందన్నారు. రాజన్న ఆలయాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నానన్నారు. ఎమ్మార్వో శ్రీనివాస్ రావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అర్బన్ మండల అధ్యక్షుడు పల్లి కనుకయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, నాయకులు పాల్గొన్నారు.

● చందుర్తి జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. చందుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో అర్హులైన 33మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, 16 లక్షల 46వేల విలువ గల 42 ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శుక్రవారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో రుద్రంగి ఏఎంసీ చైర్మన్ చెలకల తిరుపతి. తహసీల్దార్ శ్రీనివాస్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింతపంటి రామస్వామి, ఏఎంసీ వైస్ చైర్మన్ బొజ్జ మల్లేశం, నాయకులు ధర్మపురి శ్రీనివాస్, గొట్టె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, ఇందూరి మధు, పులి సత్తయ్య, నాగరాజు, ఈసరి శ్రీనివాస్, మల్లారపు రాజయ్య, దొంగరి భూమయ్య, ప్రసాద్, లాండే సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

'బోగస్'పై ఫోకస్..

(5వ పేజీ తరువాయి)

అంత్యోదయ కార్డులు 13,748, ఆహార భద్రత కార్డులు 1,63,900, అంత్యోదయ అన్న యోజన కార్డులు 203 ఉన్నాయి. వీటి పరిధిలో లబ్ధిదారులు 5,35,920మంది ఉన్నారు. ఇందులో అంత్యోదయ లబ్ధిదారులు 37,389 మంది, ఆహారభద్రత లబ్ధిదారులు 4,98,324 మంది, అంత్యోదయ అన్నయోజన లబ్ధిదారులు 207మంది ఉన్నారు. వీరికి మూడు నెలల కోటా 98.59లక్షల కిలోల బియ్యం పంపిణీ చివరి దశకు చేరుకుంది.

రాజన్న ఆలయంలో సాధారణ భక్తుల రద్దీ

వేములవాడ రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం సాధారణ భక్తుల రద్దీ నెలకొంది. ధర్మగుండంలో స్నానాలు ఆచరించిన భక్తులు తలనీలాలు సమర్పించి క్యూలైన్ల ద్వారా వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులను చెల్లించుకున్నారు.

సార్వత్రిక సమ్మెకు అధికారులు సహకరించాలి

- నోటీసులు అందించిన కార్మిక సంఘాల నాయకులు



కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి నోటీసులు అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెకు జిల్లాలో అన్ని శాఖల అధికారులు సహకరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డిలు కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టరేట్ ఏవో రాంరెడ్డితోపాటు జిల్లా వైద్యాధికారి, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పౌరసరఫరాల అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులను కార్మికసంఘాల నాయకులు శుక్రవారం కలిసి సార్వత్రిక సమ్మె నోటీసులను అందించి జూలై 9న ఉద్యోగులు, కార్మికులకు సెలవులను ప్రకటించాలని కోరారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ దేశంలో ఉన్న 44 కార్మిక చట్టాలను కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నాలుగు కోడ్ చట్టాలుగా విభజించి కార్మికులను, ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతోందన్నారు. ఇప్పటికే కార్మిక చట్టాలు, కార్మికులకు పూర్తి స్థాయిలో ఉపయోగంగా లేకుండా పోయాయన్నారు. ప్రస్తుతం కార్పొరేట్ శక్తులకు, ఎఫ్‌డీఐలకు అనుకూలంగా చట్టాలను మార్పులు చేసి 8 గంటల పని విధానం, సమ్మెచేసే హక్కు, కనీస వేతనాల హక్కులాంటి వాటితో పాటు భవన నిర్మాణ రంగంలో లేబర్ కార్డు వ్యవస్థను ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. సహజ సంపదల దోపిడీ కార్పొరేట్ సంస్థలకు ధారాదత్తం చేసే విధానాలకు నిరసనగా జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెలో ప్రతి ఉద్యోగి పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జవేణు, టీయూసీఐ నాయకులు జిందం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మేలు జరిగితే ఓర్వలేకపోతున్నారు

ఇల్లంతకుంట, జూన్ 27(ఆంధ్రజ్యోతి) కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదలకు మేలు చేస్తుంటే ఓర్వలేకపోతున్నారని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వెలిచాల జ్యోతి, మాజీ ఎంపీటీసీ తీగల పుష్పలతలు పేర్కొన్నారు. మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో శుక్రవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులతో కలిసి మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాటలను ఖండించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు బీఆర్ఎస్ పాలనలో ఏనాడు ఇళ్ల గురించి పట్టించుకోలేదని విమర్శించారు. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఇందిరమ్మ కమిటీల ద్వారా లబ్దిదారులను నిష్పక్షపాతంగా ఎంపిక చేస్తే బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరి పాలనలో పేదలకు న్యాయం జరిగిందో తేల్చేకోవడానికి బహిరంగ చర్చకు సిద్దం అన్నారు. బీఆర్ఎస్ జెండామోసిన గ్రామశాఖల అధ్యక్షులకు సైతం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. మరోసారి మాజీ ఎమ్మెల్యే ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తే చూస్తు ఊరుకోమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు చిక్కుడు పద్మ, జ్యోతి, కావ్య, ముత్తవ్వ, నాయకులు ఐరెడ్డి మహేందర్‌రెడ్డి, పసుల వెంకటి, యాస తిరుపతి, విజయ్, మల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా కురుమ సంఘం బోనాలు



బోనాల వేడుకలో పాల్గొన్న చల్మెడ లక్ష్మీనరసింహారావు తదితరులు

వేములవాడ, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : వేములవాడలో కురుమ సంఘం(సెటిలర్స్) ఆధ్వర్యంలో బద్దిపోచమ్మ అమ్మవారికి శుక్రవారం బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గం ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, సెస్ మాజీ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, నాయకులు వాసాల శ్రీనివాస్, కమలాకర్‌రెడ్డి, గోసుకుల రవి, గణేష్, కురుమ సంఘం అధ్యక్షులు గుంటి కనకయ్య, కురుమ సంఘం కులస్థులు సాయి కుమార్, చిమ్మల మల్లేశం, బీరయ్య, ఏనుగుల శ్రీనివాస్, కృష్ణ, భక్తర్ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

- జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

సిరిసిల్ల రూరల్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జనవిజ్ఞాన వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్ కోరారు. సిరిసిల్ల అర్బన్ పరిధిలోని రగుడు శివారులోని రంగినేని చారిట్రబుల్ ట్రస్ట్‌లో శుక్రవారం 'శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జనవిజ్ఞాన వేదికలో భాగస్వాములు కండి' అంటూ జనవిజ్ఞాన వేదిక రూపొందించిన కరపత్రాలను రంగినేని మోహన్‌రావుతోపాటు జనవిజ్ఞాన వేదిక నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంపత్ కుమార్ మాట్లాడుతూ మనిషి ఎదుర్కొంటున్న అన్నిరకాల సమస్యలను పరిష్కరించుకునే శక్తి ఉందన్నారు. సామాజిక, ఆర్థిక అంశాల విశ్లేషణ, అధ్యాయనాలను శాస్త్రీయ హేత వాద దృక్పథంతో చేసే అలవాటుని ప్రజానీకంలో పెంపొం దించే లక్ష్యంతో పనిచేస్తున్న జనవిజ్ఞాన వేదిక ప్రజలందరు అందరించాలని కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి పారం లక్ష్మీనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు గుర్రం అంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీహరి, తౌట్ మధుసూదన్, రాజలింగం, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలి

- తహసీల్దార్ కార్యాలయం ముట్టడి..



తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన రైతులు

వీర్నపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : తొమ్మిదో ప్యాకేజీ పైపులైన్ పనుల్లో నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలని రైతులు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వకుండా ఆపిన రైతులందరికి వెంటనే ఖాతాల్లో డబ్బులు జమచేయాలని వీర్నపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని రైతులు శుక్రవారం ముట్టడించారు. అనంతరం స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శివకుమార్‌కు రైతులు వినతిపత్రాన్ని అందించారు. మండలంలోని మద్దిమల్ల, వీర్నపల్లి, కంచర్ల గ్రామాల్లోని సుమారు 20 మంది రైతులకు రైతు భరోసా రాలేదని వాపోయారు. గతంలో పైపులైన్ కోసం తీసుకున్న భూమికి మాత్రమే పెట్టుబడి సాయం ఇవ్వలేదన్నారు. ఈ సంవత్సరం రైతు పేరిట ఉన్న భూమి మొత్తానికి రైతు భరోసా నిలిపివేశారని వాపోయారు. వెంటనే ప్రభుత్వం విచారణ చేపట్టి రైతు భరోసాని అందించాలని కోరారు. లేదంటే రైతులందరం కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకుడు అరుణ్‌కుమార్, రైతులు నాగరాజు, ప్రకాష్, లింబాద్రి, జనార్ధన్, లక్ష్మణ్, శేఖర్, రాజేశం, ప్రవీణ్, దేవయ్య, నర్సయ్య, శంకర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

- జిల్లా విద్యాధికారికి బీఆర్ఎస్ నాయకుల వినతి



జిల్లా విద్యాధికారికి వినతిపత్రం అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్, యూనిఫాంలు, షూలను విక్రయిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్న పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు కంచర్ల రవిగౌడ్ డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం జిల్లా విద్యాధికారి వినోద్‌కుమార్‌ను కలిసి ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న దోపిడీలతో పాటు విక్రయాలపై నిషేధాన్ని విధించి ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా కంచర్ల రవిగౌడ్ మాట్లాడుతూ కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులను వసూలు చేయడం వలన విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని దీనిపై విద్యాశాఖ అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల బోర్డులను ఏర్పాటు చేసి పాఠ్యపుస్త కాలు, నోట్‌బుక్స్‌లు, యూనిఫాంలను అమ్ముతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లూరి సాయికిరణ్, షేక్ అఫ్రోచ్, కోడం వెంకటేష్, ఎండి అజ్జు, తిరుమలేష్, రాకేష్, మొగిలి రంజిత్ పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు

ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేట, వీర్నపల్లి నూతన ఎస్ఐలుగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐలు రాహుల్‌రెడ్డి, రమాకాంత్, లక్ష్మణ్‌లను ఎల్లారెడ్డిపేటలోని పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎల్లారెడ్డిపేట ఎస్ఐగా విధులు నిర్వహించిన రమాకాంత్ గంభీరావుపేటకు బదిలీపై వెళ్లారు. ప్రొబేషనరీ ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఇక్కడకు బదిలీపై వచ్చారు. గంభీరావుపేట ఎస్ఐగా పని చేసిన ప్రేమానందం డీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు. ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ వీర్నపల్లికి బదిలీపై వచ్చారు. అక్కడ పని చేస్తున్న ఎల్లాగౌడ్ వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలు మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు పాటుపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, రాజేందర్, మల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● రుద్రంగి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : రుద్రంగి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా బి శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తామన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ మోతీరామ్ ఎల్లారెడ్డిపేట మండలానికి బదిలీపై వెళ్లారు.

● తంగళ్లపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి ఎస్ఐగా ఉపేంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. తంగళ్లపల్లి ఎస్ఐగా పనిచేసిన రాంమోహన్ వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. కరీంనగర్ జిల్లాలో పని చేసిన ఉపేంద్రను తంగళ్లపల్లికి బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. శుక్రవారం తంగళ్లపల్లి ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించారు.

విధులపై అవగాహన పెంపొందించుకోవాలి..



మాట్లడుతున్న డీఆర్డీవో శేషాద్రి

తంగళ్లపల్లి, జూన్ 27 (ఆంధ్రజ్యోతి): పదాధికారులు విధులపై అవగాహన పెంపొందించుకోవాలని డీఆర్డీవో శేషాద్రి సూచించారు. శుక్రవారం తంగళ్లపల్లి మండలంలోని గ్రామ సంఘాల నూతన పదాధికారులకు(అధ్యక్షులు, కార్యదర్శి, కోశాధికారి) విధులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లడుతూ అధికారుల సూచనలతో ఆర్థిక అభివృద్ధి సాధించి సంఘాలను బలోపేతం చేసుకోవలన్నారు. పదాధికారుల విధులు, బాధ్యతల, కమిటీల విధులు బాధ్యతలు, పుస్తక నిర్వహణ, ఆర్థిక లావాదేవీల నిర్వహణలపై స్టేట్ రిసోర్స్ పర్సన్స్ కాకతీయ, ఖతిజా బేగం శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీఎంలు దివ్య, చంద్రయ్య, సీసీలు, గ్రామ సంఘాల కార్యవర్గ సభ్యులు, మండల సమాఖ్య పదాధికారులు, మండల సమాఖ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డుపై కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

- కూరుకుపోయిన వాహనం - ఇబ్బందులు పడిన ప్రజలు



తాత్కాలిక రోడ్డులో వాహనం కూరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కోనరావుపేట, జూన్ 27 (ఆంధ్రజ్యోతి) : కాంట్రాక్టర్ తాత్కాలిక రోడ్డు పనులపై నిర్లక్ష్యం చేయడం వల్ల ఓ వాహనం కూరుకుపోయింది. దీంతో వాహనాలు ఎక్కడికక్కడ ఆగిపోయి ప్రజలు వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడ్డారు. కోనరావుపేట మండలం సుద్దాల ఎక్స్ రోడ్డు నుంచి మంగళపల్లి వరకు తారురోడ్ నిర్మాణం పనులు సదరు కాంట్రాక్టరు చేపట్టారు. కాగా, మంగళపల్లె-సుద్దాల ఎక్స్‌రోడ్ మధ్య ఉన్న కల్వర్టు నిర్మాణంలో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డు నిర్లక్ష్యంగా చేయడం వల్ల వాహనం కూరుకుపోయింది. వాహనదారులు ఎన్ని ఇబ్బందులు పడినా బయటకు రాకపోవడంతో అందులో ఉన్న సామగ్రిని తొలగించి జేసీబీ ద్వారా బయటకు తీశారు. దీంతో సుమారు మూడు గంటలు వాహనదారులు ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇప్పటికైనా సదరు కాంట్రాక్టర్ పనులపై నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పలు గ్రామాల ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.